జననీ! జన్మభూమిః!

"ఏమిట్రా నువ్వంటున్నది సుధీర్ !"

కంగారుగా తలెత్తి చూచి అంది పద్మజారావ్ !

తనకోసం డైనింగ్ టేబిల్ మీద మూతపెట్టబడివున్న గాజుప్లేటు, తనదగ్గరగా జరుపుకొంటూ నింపాదిగా అన్నాడు సుధీర్. "రేపు కలెక్టరాఫీసు దగ్గర, సైన్యంలో చేరదల్చుకున్న యువకుల్ని రిక్రూట్ చేస్తారటమ్మా! నేను చేరుతాను !" మరోమారు అర్థమయ్యేలా తల్లికి చెప్పి, చేతిలో చెయ్యి వేసుకున్నాడు సుధీర్.

క్షణకాలం కొడుకువేపు అయోమయంగా చూచింది పద్మజారావ్ ! అప్రయత్నంగా ఆమె భ్రుకుటి ముడివడింది అప్పుడప్పుడూ ఇతగాడికోసం వచ్చే శర్మ, జాన్....వాళ్ల దుర్బోధ కాదుకదా ఇది ? అన్నసంశయం ఆమె అంతరాంతరాల్లో మెరిసి మాయమైంది.

"నీకేమైనా మతిపోయిందా సుధీర్ ? అలాటి ఖర్మ నీకేం పట్టింది ?"

సుధీర్ ఆశ్చర్యంగా తల్లివేపు చూశాడు. "అది ఖర్మా అమ్మా ? ఖర్మ ! ఇన్ని మహిళా మండలులు స్థాపించావ్ ! మరెన్నో సంస్థలకు ఆనరబుల్ సెక్రటరీగా వున్నావ్! ఎంతో ఉత్తేజంగా ఎన్నో ఉపన్యాసాలిస్తావ్ ! ఎం. ఏ. పాసైన

నువ్వేనా ఇలా మాట్లాడుతున్నదీ ?" అతగాడి ఎర్రని ముఖం చిరుకోపంతో మరికాస్త ఎరుపుకు తిరగటంచూచి, లోలోపల మురిసిపోయింది పద్మజారావ్ ! "నా కొడుకు చాలా అందగాడు ! అవును మరి నేనెంత అందంగాలేను, ఈ వయసులోనైనా ?" అందామె మనసు గర్వంగా....

"ఏమిటమ్మా పలకవు ? మరి నా పేరెందుకు సుధీర్ అనిపెట్టావ్ ?" కోపంగా అరిచాడు సుధీర్.

పద్మజారావు ఫక్కున నవ్వింది....

"అసలు రణధీర్ అని పెడదామన్నారు మీనాన్నగారు.... నాలుగక్షరాల పేరు నాకింష్టలేక పోయింది...." ఆ విషయాన్ని, ఆ వాతావరణాన్ని, సహజంగా మార్చాలన్న ధోరణిలో నవ్వుతూనే అంది ఆమె.

"ఇప్పుడు తమాషాలు కాదమ్మా ! నేను రేపు వెళ్ళి చేరతాను. తాటిచెట్టల్లే ఇంత పొడుగు పెరిగాను....నా మజిల్స్ చూడు ఎలాఉన్నాయో....తప్పక నెలకు చేసుకుంటారు....నాన్నగారు కూడా ఏమీ అనరు...." సుధీర్ ప్లేట్లో చెయ్యి కడుక్కుంటూ దృఢంగా అన్నాడు.

పద్మజారావ్ తెల్లబోయింది. కొడుకు చాలా పట్టుదలగానే వున్నాడన్నది బోధపడింది....

అతగాడి వెనకాలే, బెడ్‌రూంలోకి నడిచింది.... బెడ్ మీద కూర్చున్నాడు సుధీర్. కుర్చీలో దగ్గరగా కూర్చుని మెల్లిగా అందామె.... "చూడునాన్నా ! వున్నది నువ్వొక్క-

డివి నాకు........మనఆస్తి ఎంత వుందో నీకు తెలుసుకదూ ? మీ నాన్నగారు ఫారిన్‌లో ఉన్నారుకదా .... ఆయనగారు రాగానే, ఇక బిజినెస్ అంతా నీకు అప్పగించాలనుకుంటు న్నారు.... నువ్వలా వెళ్ళిపోతే.... ఇదంతా మేమేం చేసుకో వాలి ?" ఆమె కళ్ళలో నీళ్లు సుడులు తిరిగాయి....

సుధీర్ కలవర పడ్డాడు....“అదేమిటమ్మా....” అత గాడి మాటలకు అడ్డొస్తూ అంది పద్మజారావ్ “.... ఈవయ స్సులో నీ ఆవేశం ఇలాగే వుంటుంది. నాన్నా ! కాని వెళ్ళి పోతున్న వయస్సులో మా ఆవేదన కాస్త అర్థంచేసుకో....”

“మరి దేశం....?”

ఆమె కన్నీళ్ళు చప్పున తుడుచుకుంటూ నవ్వింది.... “....దేశం ఏమీ కాదు....దానికోసం చాలామంద్ది వున్నా రులే....ప్రభుత్వాలు మారవచ్చు ....మళ్ళీ సర్దుకోవచ్చు.... కానీ ఒక్కసారి ఆస్తి, అంతస్తూ పోగొట్టుకొంటే....తిరిగి అవి సంపాదించుకోలేం నాన్నా ! అవి ఉన్నంత వరకే మనం పది మందిలో గౌరవంగా బ్రతగ్గలం....నా మాట విను....బిడ్డగా నిన్నే విషయంలోనూ నొప్పించలేదు ఇందాకా ! ఈ విష యంలో నన్నూ మీ నాన్నగారినీ నొప్పించకు....నీకంతగా ఓ సారి అలా తిరిగి రావాలనుంటే, రేపే ఏదేనా “బోయింగ్” లోసీట్ రిజర్వు చేయించుకో....అలా అలా తిరిగిరా !”

పద్మజారావ్ లేచి తన గదిలోకి వచ్చేసింది....సుధీర్ మౌనంగా పడుకున్నాడు.

*　*　*

"నీకిదేం పాడుబుద్ధిరా రఘూ ! ఏదో ఆ బి. ఏ. కాస్త పూర్తయిందికదాని మేం సంబరపడుతూంటే........"
వెంకటరావు గర్జిస్తున్నాడు....

రఘు నేలచూపులు చూస్తున్నాడు.... "ఇప్పుడప్పుడే ఏ ఉద్యోగమూ వచ్చేలా లేదు నాన్నా !" నసుగుతూ అన్నాడు....

"....అందుకని సైన్యంలో చేరి చస్తావా ?"

"అపశకునపు మాటలూ ! మీరూను" రంగంలోకి విశాలక్షమ్మ రానే వచ్చింది.

"....చేరిన వాళ్ళంతా చావరు నాన్నా!"

"....చాల్లేవోయ్ అతి తెలివి. రేపు నేనూ నీవెంట వస్తాను. ఆ ఎం. ఎల్. ఎ. రామారావుగారిని బ్రతిమాలి ఎక్కడో ఓ చోట టెంపరరీగానైనా, ఓ గుమస్తాగానైనా వేయమంటాను .... అట్టే గొడవ చెయ్యక....మరో మాటకు అవకాశం ఇవ్వకుండా బయటికి వెళ్ళిపోయాడు వెంకటరావు.

"ఛీ....ఓ దేశభక్తి లేదు.... ఓ ధైర్యం లేదు....బానిస బ్రతుకు...." పెద్దగా గొణుగుతున్న కొడుకు వేపు వాత్సల్యంగా చూచింది విశాలక్షమ్మ....

"ఆయనకు తిక్కకోపం....అదే సర్దుకుంటుంది........ అయినా మనకెందుకులేరా రఘూ ! సైన్యాలూ వల్లకాడూను .... ఏదో గుమాస్తానో, టీచరో అయితే....నాలుగు రాళ్ళు తీసుకొస్తే....కాస్త మీనాన్నకు చేదోడు వస్తావు ....

నీకు ఉద్యోగంవస్తే, వచ్చే ఏడాదైనా గిరిజపెళ్ళి చెయ్యాలి. దానికి పద్దెనిమిదేళ్ళు నిండిపోతున్నాయి మరి !

ఆమె వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది.

రఘు ఆ చిన్న గదిలో....అలాగే నిల్చుండి పోయాడు.

*　　*　　*

"నేను రేపు సైన్యంలో చేరిపోతానమ్మా! తిండీ, బట్టా ఇచ్చి మంచిమంచి జీతాలిస్తారట!" వీరాయి ఉల్లాసంగా చెప్పాడు.

చంద్రమ్మ కళ్ళలో ఎంతో వెలుగు "నిజంగా నట్రా?" అంది....

"నిజంగానే! ఇప్పుడే ఆ ఆఫీసరు దగ్గరికిపోయి మాట్లాడొచ్చాను కూడా! వివరాలన్నీ చెప్పాడు.... రేపు చాలా మందిని తీసుకుంటారట....వచ్చే నెలనుంచి ఠంచనుగా జీతం వస్తుంది....ఇక్కడికి పంపేస్తాను....నువ్వు చీరె కొనుక్కో; గురవడికీ, నారిగాడికీ, శాయికీ, లక్ష్మికీ ఇంక ఒంటి నిండా బట్టలూ, కడుపునిండా తిండీ పెట్టు.... అక్కడ నాకు తిండీ బట్టా గడిచిపోతుంది! ఆఖరుకు దోమ తెరలూ. స్వెట్టర్లూ.... చలికి తొడుక్కునే కోట్లన్నమాట....ఇస్తారట కూడాను!" సంతోషంగా వీరాయి చెబుతుంటే చంద్రమ్మ మనసు ఆనందంతో తేలికైపోతుంది. క్షణకాలం తనచుట్టూరా చిమ్మ చీకటి, రోజుమార్చి రోజు పస్తులు! రోశయ్య ఒక్కడి రెక్కల కష్టం! తనూ కూలీ నాలికి వెళ్తోంది. అయినా కడుపులు నిండటం లేదు! నారిగాడికి పధ్నాలుగేళ్ళు వస్తున్నాయో

ఏమో ! వాణ్ణి కూలికి పంపిస్తున్నారు. వాడు మొయ్యలేక, మొయ్యలేక నరాలు తెంచుకుంటూ బస్తాలు మోస్తుంటే ....తల్లి పేగు తెంపేసినట్టే అవుతోంది! ఒక్కరోజు కూలికి ఒక్కరు వెళ్ళకుంటే.... రెండో రోజు పస్తే! మరి మానెడు గింజలు రెండురూపాయలు ! పూటకు మానెడు చాలకపోయె!

అంతలోనే గుండెలు పిండివేసే ఆలోచన ఆమె ఎదలో ముల్లులా కదలాడింది....“సైన్యంలో చేరితే....యుద్ధం వస్తే.. తనబిడ్డ....!” ఆ మాటే మెల్లిగా అంది....వీరాయి పక్కన నవ్వాడు.

“యుద్ధంలోగాక ఇక్కడ మాత్రం చావకూడదా ఏమిటే అమ్మా? పస్తులుండి చచ్చేకంటే....బతికిన నాలుగు రోజులూ నేను హాయిగా తిండితింటాను...నీకూ, అయ్యకూ, తమ్ముళ్ళకూ, చెల్లెలికీ ఇంత తిండిపెడతాను. అలాటి మంచి చావు చస్తేమాత్రం ఏం ?” నిర్లక్ష్యంగా గుడిసె బయటికి వెళ్ళిపోయాడు....కొడుకన్న మాటలు రోశయ్యతో చెప్పింది. చంద్రమ్మ.... రోశయ్య మీసం మెలేస్తూ గర్వంగా నవ్వాడు. “ఆడు! ఆడు ! నా కొడుకే చంద్రీ! గుండె దెయిర్యం ! అది నాది....” రాతిలావున్న తన ఛాతీమీద గర్వంగా చేత్తో చరుచుకున్నాడు రోశయ్య....“అచ్చర లచ్చలు చేసే మాట న్నాడు నాబిడ్డ! మరివాడు ఏడో తరగతిదాకా సదువుకున్నా డాయె! తెలివీ తేటా ఎట్టాగొచ్చిందో చూడు!”

చంద్రమ్మకు ఆనందమూ, దుఃఖమూ రెండూ కలి గాయి....అణుచుకుంది.... తెల్లారి లేచేసరికి ఆమెకు ఏబాధా

మిగల్లేదు. కారణం తన చుట్టుపక్కల గుడిసెల్లో చాలా మంది వయసు కుర్రవాళ్లు వీరాయితో బాటు సైన్యంలో చేరటానికి సిద్ధమై వెళ్తున్నారు. అందరికందరూ వీరాయిలానే మాట్లాడుతున్నారు....

* * *

పదేళ్ళు గిర్రున తిరిగాయి.... చరిత్ర పుటల్లోకూడా చిత్ర విచిత్రాలు దొర్లుతున్నాయి....

దేశం మారిపోయింది....మనుషులు మారిపోయారు.... సామాన్యులు మరీ సామాన్యులుగా మారిపోతున్నారు.... గొప్పవాళ్ళు మరీ గొప్పవాళ్ళుగా మారిపోతున్నారు....మధ్య తరగతి కుటుంబాలు గానుగెద్దుల్లా....ఒకే పరిధిలో గిర గిర తిరుగుతున్నాయి....

సుధీర్ ఇప్పుడు బిజినెస్‌లో మెలకువ లన్నీ తెలుసుకున్నాడు. తండ్రి యిచ్చిన ఆస్తిని రెట్టింపుగా పెంచాడు.... త్వరలో రాబోయే ఎలక్షన్స్‌లో సమితి ప్రెసిడెంటుగా పోటీ చేయబోతున్నాడు....భార్య హేమతో ఈ మధ్యే కాశ్మీరుకు విలాసయాత్రకూడా చేసివచ్చాడు. రావుగారూ, పద్మజారావ్ ....చాలా సభలకూ, సమావేశాలకూ గౌరవాధ్యక్షులుగా ....వక్తలుగా వెళ్తూ.... కాలం సరదాగానే వెళ్ళబుచ్చుతున్నారు..ఆనాటిమూర్ఖపుపట్టుదల వదలి సుధీర్ ఇలా హాయిగా వున్నందుకు వాళ్లిద్దరూ ఆనందించని క్షణంలేదు. అప్పుడప్పుడూ, తనెలా సుధీర్ మనసు మార్చగలిగిందీ, గర్వంగా కోడలితో చెబుతూంటుంది పద్మజారావు.

"ఉయ్ ఆర్ ఎడ్యుకేటెడ్ ! అవర్ డ్యూటీ ఈజ్ టు డైవర్ట్ దెమ్ టు ఎ గుడ్ పాత్" అంటుంది నవ్వుతూ.

*　　*　　*

రఘు ఎనిమిదేళ్ళుగా యు.డి.సి. గా వున్నాడు.... భార్య మీనాక్షి స్కూల్ ఫైనల్ పాసై, టైప్ పరీక్షలు పాసైంది. ఇద్దరు పిల్లలు....త్వరలో మీనాక్షిని కూడా ఎక్కడేనా టైపిస్ట్‌గా చేర్చితే తప్ప, గిరిజ పెళ్ళికైన అప్పు తీరేలా తోచడంలే దతగాడికి....సంసారమూ గడిచేలా కన్పించటం లేదు. ఇద్దరు తమ్ముళ్ళు వరసగా చదువుకు ఎక్కొచ్చారు. మరో చెల్లాయి ఓణీలు వేస్తోందీ మధ్యే !

సుధీర్ గారినో, పద్మజారావుగారినో, రావుగారినో.... బ్రతిమాలో.... మనసు కరిగేలా విన్నవించుకునో....కావలిస్తే మరెవరికైనా....ఓ పదో, పరకో తడి తగిలించో....ఎలాగో ఓలా తనకు ప్రమోషనూ, మీనాక్షికి ఉద్యోగమూ వచ్చేలా చూచుకోవాలన్నదే అతగాడికి రాత్రింబగళ్ళు ఆలోచనై పోయింది.

వీరాయి చాలా మారిపోయాడు.... వీరారావుగా మారాడు. హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, బెంగాలీ, కన్నడం, తమిళం....ఒకటేమిటి ఏడెనిమిది భాషల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నాడు....మంచి మంచి పాంట్లు..ఉలన్ స్వెటర్లు.. మంచి తిండి..ట్రాన్సిస్టరు....వాచీ....దర్జాగా వుందతగాడికి.... శెలవులకు ఇంటికివచ్చేటప్పుడు చెల్లాయిలకూ, తమ్ముళ్ళకూ, తలిదండ్రులకూ చాలా మిఠాయిలూ, బట్టలూ పట్టుకొస్తాడు. ట్రాన్సిస్టరు తెస్తాడు....ఉలన్ స్వెటర్లు తెచ్చాడు. కప్పుకునే

రగ్గులు., బిస్కెట్ ప్యాకెట్లు ఒకటేమిటి? అతగాడొచ్చిన పదిరోజులూ అదో పండగగా గడిచిపోతుంది ఇంటిల్లిపాదికీ.... గుడిసె పీకించి ఈ మధ్యే చిన్న పెంకుటిల్లు రెండు గదులతో వేయించాడు తండ్రి తను పంపిన డబ్బుతో.

"నేనూ నీలానే సైన్యంలో చేరతారా అన్నా!" అని నారిగాడు అంటే...."అలాగేరా నారాయణా! మంచిదే చేరు దూగానీ!" అంటాడు నవ్వుతూ. ఆ సమయంలో అతగాడి అంతరాంతరాల్లో మాత్రం "నువ్వు నూరేళ్ళూ నిండుగా బ్రతకాలిరా నారాయణా!" అన్న నిట్టూర్పు రేగి చప్పున చల్లారిపోతుంది. రోశయ్య, చంద్రమ్మ....కొడుకుని చూచు కొనీ, తలచుకొనీ, గర్వపడని క్షణం లేదు.

"నా తండ్రి ఎక్కువచ్చాడు. మాకింక దిగుల్లేదు!" అనుకుంటారు ఇద్దరికిద్దరూ.

అందరూ నిద్రపోయాక అర్ధరాత్రిలో అలా ఆకాశం కేసి చూస్తూంటాడు వీరాయి ఒక్కోసారి. ఆ సమయంలో అతగాడిమనసులో చిత్ర విచిత్రాలైన భావ పరంపరలు మొదలౌతాయి.

"నా వాళ్ళంతా హాయిగా వున్నారు! కడుపునిండా తిండీ, ఒంటినిండా బట్టా, కంటినిండా నిద్ర ఇవ్వగలిగాను. చాలు. నాతల్లి, తండ్రి....తోబుట్టువులకు నా ఋణం తీర్చు కుంటున్నాను. ఇదెంత హాయిగా వుంది! ఈ సంతోషం.... ఈ సంతృప్తి ముందు మరణమన్నది ఎంత? చస్తేమాత్రం ఏం?"

ఆ సంతృప్తితో గుండెలమీద చెయ్యి వేసుకొని హాయిగా నిద్రపోతాడు మరుక్షణంలో.

*   *   *

ఆరోజు శలవులకు ఇంటికొచ్చాడు వీరాయి. వచ్చిన మూడోరోజే కమాండర్ దగ్గర్నుంచి యుద్ధం ప్రారంభం కాబోతోందనీ.... వున్నఫళాన సెంటర్‌కు రావలసిందనీ టెలిగ్రాం వచ్చింది.

దిగాలుపడిన చంద్రమ్మకు ధైర్యం చెప్పాడు. తండ్రికి కళ్ళతోనే వీడ్కోలు చెప్పాడు. నవ్వుతూ ట్రెయిన్ ఎక్కాడు. మరి తిరిగిరాలేదు.

యుద్ధం ముగిసింది....

చాలామంది మిలిట్రీ ఆఫీసర్లకూ, పైలట్లకూ, నౌకాదళాధిపతులకూ, బ్రతికివున్నవారికీ, చనిపోయినవారికీ.... వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలకు గుర్తింపుగా మెడల్స్ అందజేయబడుతున్నాయి.... ఆ రోజంతా చనిపోయిన వీరజవానులకు శ్రద్ధాంజలి సమర్పించే సభలు దేశమంతటా జరుగుతున్నాయి.

ఆ సభలో....

సుధీర్ తన పేరుతో సైనిక కుటుంబాల సహాయార్థం నిధి వసూలు చేస్తానని, మొదటి విరాళం గా వెయ్యిరూపాయలిస్తానని ప్రకటించాడు.

చాలా రోజులుగా రఘు, వెంకటరావు ఇలాటి అవకాశంకోసమే కనిపెట్టుకుని వున్నారు. పెద్దపెద్దవాళ్ళంతా ఒక

చోట చేరినపుడే తమ పనులు కాస్త వాళ్ళ చెవిని వేయటం, ఔననిపించుకోవటం మంచిదని ఇద్దరికీ వుంది.

"ఆరోజు నేను వద్దనబట్టి సరిపోయింది! లేకుంటే ఈనాడు నీగతి ఏమైవుండేది? ఈ సభలో నువ్వూ ఓ కీర్తిశేషుడివిగా మిగిలిపోదువు!" అన్నట్లు చూపులు విసురుతున్నాడు వెంకటరావు కొడుకు వేపు అప్పుడప్పుడూ.

కండ, గుండె ఏనాడో చచ్చిన రఘు "ఔనౌను" అన్నట్లు తలాడిస్తున్నాడు వుండీ వుండీ—జీవచ్ఛవంలా!

పద్మజారావు నిజంగానే చాలా అలసటగావుంది! అధ్యక్షోపన్యాసం అయ్యేంతవరకూ....కుర్చీలో వెనక్కు తలవాల్చి రిలాక్స్ అవుతోంది!

నిన్నంతా ఆమె చాలా శ్రమపడింది. రోశయ్య చంద్రమ్మల ఇంటికి స్వయంగా కారులో వెళ్ళింది. ఇద్దరినీ చాలా వివరాలు అడిగింది. వీర్రాయి పుట్టిన తేదీ కాదుకదా, సంవత్సరం కూడా వాళ్ళకి తెలియదన్నారు. ఉజ్జాయింపుగా తనే లెక్క కట్టుకుంది. వాళ్ళిద్దరూ ఏడుస్తూ చనిపోయిన తమ కొడుకుని వర్ణిస్తుంటే....జాగ్రత్తగా అతగాడి ఆకారాన్ని మనసులో గుర్తుంచుకొంది. వీర్రాయి సెకెండు ఫారం వరకూ చదువుకున్నాడన్నది గుర్తుంచుకొంది....చంద్రమ్మ పేరు.... సైన్యంలో చేరటానికి వెళ్ళేముందు, ఆ తల్లీకొడుకుల సంభాషణా అంతా జాగ్రత్తగా ఏకసంతాగ్రాహిలా మనసులోనే నోట్ చేసుకుంది.

ఇంటికి వచ్చాక....చరిత్ర పుటల్లో మరుగుపడివున్న వీరమాతల పేర్లూ, మరికొన్ని పిట్టకథలూ అన్నీ క్రోడీకరించుకుంది.

రాత్రంతా కూర్చుని చాలా "ఎమోషనల్" అయిన స్పీచ్ తయారు చేసుకుంది. పాయింట్స్ నోట్ చేసుకుంది. తెల్లారు ఝామున ఓ సారి మనసులోనే రిహార్సల్స్ వేసుకుంటుంటే, మెలకువ వచ్చిన రావుగారు ఆశ్చర్యంగా భార్య కేసి చూశారు.

"ఇంకా నిద్రపోలేదూ? పద్మా?" అన్నారు కంగారుగా.

"ఊహూఁ! స్పీచ్ ప్రిపేర్ చేసుకున్నాను!" అంది ఆవులిస్తూ—ఒళ్ళు విరుచుకుంటూ.

"అబ్బ? ఏదో నాలుగు ముక్కలు చెబితే పోయే దానికి....ఇంతగా హైరాన పడాలా?" అన్నారాయన నిద్ర మత్తులోనే....

ఊహూఁ! నాలుగు ముక్కలు ఎవరేనా చెబుతారు ....నా స్పీచ్ ఎమోషనల్ గా, మాబ్ ను అట్రాక్ట్ చేసేదిగానూ, ఇంప్రెస్ చేసేదిగానూ వుండాలి!....ఇలాంటి అవకాశం ఎప్పుడోగాని రాదు! ప్రెస్ రిపోర్టర్సు కూడా చాలామంది వస్తారని విన్నాను...." అలసట పారద్రోలటానికి ఓ కప్పు ఓవల్టిన్ తాగి తెలతెలవారబోతూండగా పడుకుంది.

అంచేతే ఇప్పుడు నిద్ర ముంచుకు వస్తోంది. ఈ రెండు గంటలు కాస్త ఓపికపడితే. ఇంటికి వెళ్ళి హాయిగా నిద్ర పోవచ్చు అనుకుంటోందామె కళ్ళు మూసుకొని....

"....శ్రీమతి పద్మజారావు మాట్లాడుతారు."

అధ్యక్షుని గొంతుక ఖంగుమంది మైక్‌లో. పద్మజారావు మెల్లిగా లేచి మైక్ ముందుకొచ్చింది. ఆమెలో వున్న సహజమైన అలసట....ఆ సన్నివేశంలో ఆమె ముఖంలో శోకరసాన్నికూడా ప్రతిబింబించేలా చేసింది.

"మన వీరాయి....వీరారావు....సైన్యంలోచేరిన మరునాడు నాదగ్గరకు వచ్చి 'అమ్మగారూ ! ఇలాచేరాను' అని చెప్పినప్పుడు నేను భుజం తట్టాను. ఆబిడ్డ....ఈ గడమీద పుట్టిన మన ఆ బిడ్డ....ఇంతటి వాడౌతాడనీ, దేశాన్ని రక్షించే పవిత్ర కార్యక్రమంలో తను అసువు డౌతాడనీ, ఆనాడు నేను కలలో కూడా అనుకోలేదు. తల్లిగాని నాకే ఈనాడు గుండె పగిలిపోతోంది. మరి తల్లి చంద్రమ్మ ఎలా భరిస్తోందో ఈ రంపపుకోత ! అయితే ఆమె వీరమాత ! జిజియాబాయిలాటి మహాతల్లి. ఆ తల్లికన్న ఈ బిడ్డ మనజిల్లాకేకాదు రాష్ట్రానికే ఒక మణిపూస.

"సుధీర్ చేరుతానన్నాడు. చేరమన్నాను. తీరా ఆ రాత్రే వాళ్ళ నాన్నగారికి సుస్తీగా వున్నట్లు తెలిసి పారిస్ వెళ్ళాల్సి వచ్చింది. వచ్చాక ప్రజాసేవ చేసితీరాలంటూ పెద్దలు పట్టుపట్టారు. అంచేత మా సుధీర్‌కు "రణధీర్" అయ్యే అవకాశం లేకపోయింది. నాకూ వీరమాత అనిపించుకొనే అర్హత లేకపోయింది.

"ఆ గౌరవం, ఆ అర్హత శ్రీమతి చంద్రమ్మకు దక్కాయి. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"

అన్నారు పెద్దలు. జన్మభూమి ఋణం తీర్చుకున్న వీరారావు అజరుడు, అమరుడు.''

ఇలా గంగా ప్రవాహంలా గంటసేపు సాగిందామె ఉపన్యాసం. మధ్యమధ్యలో వీరారావుతో తన సాన్నిహిత్యం సంభాషణలు, నిన్నరాత్రి అందంగా ఊహలతో తయారు చేసుకున్నవన్నీ సమయోచితంగా ఉదహరించింది.

జనం చాలా ఇంప్రెస్ అయ్యారు. ఆమెఉపన్యాసంతో ఆ తర్వాత చాలామంది పెద్దలు వీరారావును పొగిడారు. చివరగా చంద్రమ్మను వేదికమీదికి పిల్చి వెయ్యిరూపాయల చెక్కు అందించారు.

ఆ రాత్రి....అర్ధరాత్రి....గాఢాంధకారం....

సుధీర్ హేమ కౌగిలిలో వెచ్చగా నిద్రపోతున్నాడు.

రఘు....మీనాక్షి.... వెంకటరావు....విశాలాక్షమ్మ.... ఎవరికి వారుగా....త్వరలో రఘుకు రాబోయే ప్రమోషన్ గురించీ....మీనాక్షికి రాబోయే ఉద్యోగం గురించీ....కలలు గంటూ గురకలు కొడుతున్నారు.

ఆ చిమ్మ చీకటిలో..ఆ చిన్న పెంకుటింట్లో....రోశయ్య నులక మంచంమీద కాళ్ళు కిందకువేసి కూర్చుని వున్నాడు.... అతగాడి కాళ్ళమీద తలపెట్టి చంద్రమ్మ ఏడుస్తోంది. ఆమె వెచ్చటి కన్నీళ్లు అతగాడి మోకాళ్ళమీద బరువుగా పడు న్నాయి....అతగాడి రాతిలాంటి ఛాతీ కరిగి నీరౌతోంది.....

"చంద్రీ! ఈ ఇల్లూ ఆడే కట్టించాడుగదే! మన కడుపునబుట్టి—మన గుడిసెలో పుట్టిన మన బిడ్డ....ఎంత గొప్పోడైనాడో చూశావా? పెద్ద పెద్దోల్లంతా ఆణ్ణి ఎట్టా మెచ్చుకున్నారో చూశావా! ఎంత పున్నెం చేసుకున్నామో! అంత పాపమూ చేసుకున్నాం! మనోడు మనకు దక్కలేదు!" అన్నాడు రోశయ్య....

అతగాడి కంఠస్వరం పూడుకుపోయింది.....

చంద్రమ్మ వెక్కిళ్ళు పెడ్తూ అంది.... "ఆ పెద్దోల్ల మాటలేమీ నాకర్థం గాలేదు. గానీ....నా బిడ్డ....బతికిన నాలుగు రోజులూ....మన ఋణం తీర్చుకున్నాడు. చచ్చాక కూడా.... వెయ్యిరూపాయలు....ఒక్క సంవత్సరం తిండి మన కోసం....ఇచ్చిపోయాడు....మన ఋణం తీర్చేసుకుని వెళ్ళి పోయాడు....!" ఆమె గుండె ఎగసి ఎగసి పడుతోంది. ఆమె మాతృ ప్రేమ వరదలై పారుతోంది..... దేశం ఏమిటో.... దేశభక్తి ఏమిటో ఆమెకీక్షణంలోనూ తెలియవు.... తెలిసిందల్లా....ఆకలీ....దాని క్రింద కప్పివేయబడివున్న మాతృ మమత....ఈ క్షణంలో ఆకలి పొర తొలిగి....మమత.... ఒక్కటే దహించి వేస్తోంది....మరి కొద్దిరోజుల్లో నారాయణ కూడా....ఆ కటిక చీకటిలో ఆమె తల విదుల్చుకొంటోంది పిచ్చిదానిలా !

("యువ" ఫిబ్రవరి, 71)